సాక్షి అనంతపురం

ఆదివారం । 25 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. 698 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



కదిలిన జగన్నాథ రథ చక్రాలు

ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర శనివారం అనంతపురంలో అట్టహాసంగా సాగింది. బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.2°/ 22.6°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

పద్మశ్రీ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: రిపబ్లిక్ డే సందర్భంగా అందించే ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన సంక్షేమ శాఖ (ఆన్‌సెట్) సీఈఓ కేశవనాయుడు తెలిపారు. 2024 సంవత్సరానికి గాను కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, సాంఘిక సేవ, సైన్సు, ప్రజా సంబంధాలు, సివిల్‌సర్వీసెస్, ట్రేడ్, ఇండస్ట్రీ తదితర విభాగాల్లో విశేష కృషి చేస్తున్న వారు పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15లోపు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు https@ //awards.gov.inను సంప్రదించాలన్నారు.

మొక్కజొన్న రైతులకు చెల్లింపులు పూర్తి



అనంతపురం అగ్రికల్చర్: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో ఇటీవల కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించి చెల్లింపులు పూర్తయినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యం మేరకు క్వింటా ఎంఎస్‌పీ రూ.1,962 ప్రకారం గత రబీలో పండిన 1,033.70 క్వింటాళ్లను 149 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. మొక్కజొన్న అమ్మిన రైతులందరికీ రూ.2.02 కోట్ల పైచిలుకు సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు వెల్లడించారు. సకాలంలో డబ్బు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

పీటీఐలకు నేడు రిక్వెస్ట్ బదిలీలు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ (ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్)ల రిక్వెస్ట్ బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం చేపట్టనున్నారు. ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి రావాలని ఏపీఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ నియామకానికి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని సూచించారు. ఈ ఒక్కరోజు మాత్రమే బదిలీకి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

అరుణాచలానికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు



అనంతపురం సెంట్రల్: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం గిరి ప్రదర్శనకు జూలై 3న పౌర్ణమి సందర్భంగా వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో తేదీ అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి డిపోల నుంచి గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే భక్తులకు ప్రత్యేక ప్యాకేజీగా సూపర్ లగ్జరీ బస్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద రానుపోను ఒక్కొక్కరికి అనంతపురం నుంచి రూ.1450, గుంతకల్లు నుంచి రూ.1860, తాడిపత్రి నుంచి రూ.1,570, రాయదుర్గం నుంచి రూ.1,860 ధర నిర్ణయించినట్లు వివరించారు. ఆసక్తి గల వారు సీట్లు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. ఒకే బ్యాచ్‌గా 30 మంది ఉంటే ప్రత్యేకంగా బస్ ఏర్పాటు చేసి పికప్, డ్రాపింగ్ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

సత్వర పరిష్కారం

సంక్షేమ శాఖ అధికారి ఒకరు తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి లక్ష రూపాయలు తీసుకుని, ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశాడని బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన ఒక వ్యక్తి 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశాడు. ఇప్పుడు ఆ అధికారి బదిలీ అయిపోయాడని, ఎలాగైనా తన డబ్బు వెనక్కు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. ఆ ఫిర్యాదు పోలీసు శాఖకు ఎండార్స్ అయ్యింది. దీంతో పోలీసు అధికారులు ఫిర్యాదుదారును, విశ్రాంత అధికారిని విచారణ చేశారు. చేసేది లేక ఆ విశ్రాంత అధికారి తాను తీసుకున్న సొమ్మును బాధితునికి వెనక్కు ఇచ్చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వెంటనే తనకు న్యాయం జరగడంపై బాధితుడు హర్షం వ్యక్తం చేశాడు.

- విజయవంతంగా 'జగనన్నకు చెబుదాం'
- నెలన్నర వ్యవధిలో 2,783 ఫిర్యాదులు
- పరిష్కరించినవి 1,939
- పరిష్కారానికి చర్యలు చేపట్టినవి 667
- రీ-ఓపెన్ అయిన ఫిర్యాదులు 177

అనంతపురం అర్బన్: ఏ సమస్య అయినా సరే టోల్ ఫ్రీ నంబర్ 1902 ద్వారా 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేస్తే సత్వర పరిష్కారం లభిస్తోంది. ఫిర్యాదు అందిన రోజు నుంచి సమస్య స్వరూపాన్ని బట్టి రెండు రోజుల వ్యవధి నుంచి 15 రోజుల్లోగా అధికారులు అర్జీదారుతో నేరుగా మాట్లాడి సంతృప్తికర పరిష్కారం చూపుతున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సాధ్యం కాని సమస్య 'జగనన్నకు చెబుదాం'కు ఫోన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత రోజుల వ్యవధిలోనే పరిష్కారం అయ్యిందని అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుల పరిష్కారంపై మానిటరింగ్ చేస్తున్న సిబ్బంది

సంతృప్తికర పరిష్కారం..

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి మే 9 నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై 2,783 ఫిర్యాదులు అందాయి. ఇందులో 1,939 అర్జీలను అధికారులు పరిష్కరించారు. 667 ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందని కారణంగా 177 ఫిర్యాదులు రీ-ఓపెన్ అయ్యాయి. వీటినీ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదుల మానిటరింగ్‌కు సెల్..

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను మానిటరింగ్ చేసేందుకు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అక్కడి సిబ్బంది ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తూ అవి పరిష్కారం అయ్యే వరకు మానిటరింగ్ చేస్తూ ఉంటారు. సమస్య పరిష్కరించినట్లుగా అధికారులు నివేదించిన తరువాత ఫిర్యాదుదారుకు ఫోన్ చేసి సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అని అడిగి తెలుసుకుంటారు. సంతృప్తి చెందామని వారు చెబితే ఫిర్యాదును క్లోజ్ చేస్తారు. పరిష్కారం సంతృప్తికరంగా లేదని చెబితే ఫిర్యాదును రీ-ఓపెన్ చేసి సంబంధిత అధికారికి మళ్లీ పంపిస్తారు.

సంతృప్తి చెందేలా పరిష్కారం



'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించేలా చర్యలు తీసుకున్నాం. ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలిచ్చాం. ప్రతి సోమవారం 'స్పందన' అర్జీల పరిష్కారంతో పాటు 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షిస్తూ తగిన ఆదేశాలిస్తున్నాం.

– ఎం.గౌతమి, కలెక్టర్

పట్టా మంజూరు చేశారు



సంతకొండాపురం గ్రామ పొలం సర్వే నంబరు 400-1లో 0.015 సెంట్ల స్థలంలో నివాసముంటున్నాం. దీనికి నివేశన స్థల పట్టా మంజూరు చేయించాలని 'జగనన్నకు చెబుదాం' టోల్ ఫ్రీ నంబరుకు గత నెల 12న ఫిర్యాదు చేశాం. రెవెన్యూ అధికారులు తనను కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. విచారణ చేసి నివేశ స్థల అప్పగింత పట్టా మంజూరు చేశారు. ఐదు రోజుల్లోనే నా సమస్య పరిష్కరించడం చాలా ఆనందంగా ఉంది.

– ఎస్.ఏసుదాసు, సూగేపల్లి, బ్రహ్మసముద్రం మండలం

సర్వే స్కెచ్ అందజేశారు



పెద్దకొకుంట్ల గ్రామ పొలం సర్వే నంబరు 187/ఏలో మా నాన్న పేరున భూమి ఉంది. భూమిని సర్వే చేసి సర్వే స్కెచ్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గత నెల 22న 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేశాను. వెంటనే అధికారులు స్పందించారు. సర్వేయర్ వచ్చి భూమిని సర్వే చేశారు. నోటీసు పీరియడ్ 14 రోజుల తరువాత సర్వే స్కెచ్‌ను ఉరవకొండ తహసీల్దారు స్వయంగా అందజేశారు. మా కుటుంబం సంతృప్తి చెందేలా సమస్యపై తక్షణం పరిష్కరించడం సంతోషంగా ఉంది.

– మురళి, పెద్దకొంకుంట్ల-1, ఉరవకొండ మండలం

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు

- అడిషనల్ డీఎంఈగా రఘునందన్ బదిలీ


కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రఘునందన్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన కడప సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నారు. బదిలీపై అనంతపురం రానున్నారు. ఈ నెల 28న నూతన సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న జి.రఘునందన్‌ను అడిషనల్ డీఎంఈగా విజయవాడకు బదిలీ అయ్యారు.

26, 27 తేదీల్లో టీచర్లు, పేరెంట్స్ కమిటీల సమావేశాలు

రాప్తాడురూరల్: జగనన్న అమ్మఒడి పథకంలో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అందించే నగదును ఈ నెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని స్కూళ్లల్లో 26, 27 తేదీల్లో టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. అందరు హెచ్ఎంలు ఆ రెండు రోజుల్లో ఏదో ఒక తేదీని ముందుగానే తల్లిదండ్రులకు తెలియజేసి సమావేశానికి ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

'ఎస్‌కేపీ'కి న్యాక్ గుర్తింపు



విక్టరీ సింబల్ చూపిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

గుంతకల్లు టౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మక నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు దక్కింది. ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో న్యాక్ ఇచ్చే గ్రేడుల్లో ఈ సారి ఏ-గ్రేడ్‌ని ఎస్‌కేపీ కళాశాల దక్కించుకుంది. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం ఎస్‌కేపీ కళాశాలలో పర్యటించింది. విద్యా బోధన, అధ్యాపకేతర సిబ్బంది పనితీరు, మౌలిక వసతులు, చదువు పూర్తయిన వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, నిధుల వినియోగం వంటి అనేక అంశాలను బృందం సభ్యులు పరిశీలించారు. మొత్తం ఏడు పాయింట్లకు గాను 3.12 పాయింట్లతో కళాశాలకు 'ఏ' గ్రేడ్ అందజేసినట్లు శనివారం న్యాక్ నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సంబరాల్లో మునిగి తేలారు. న్యాక్ గుర్తింపు ఉంటే అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు ఉన్నట్టుగా విదేశాల్లోని విద్యాసంస్థలతో పాటు పలు కంపెనీలు విశ్వసిస్తుండటంతో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఏ-గ్రేడ్ దక్కడం వల్ల యూజీసీ నుంచి భారీగా నిధులు సమకూరనున్నాయి. ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ న్యాక్ ఏ-గ్రేడ్ దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, సిబ్బంది పనితీరు, విద్యార్థులందరి సహకారంతోనే ఈ గుర్తింపు దక్కిందన్నారు.

కాసుల కోసం కంత్రీ వేషాల్

- 'సమగ్ర శిక్ష'లో సిమెంట్ దొంగల నిర్వాకం
- ఆపరేటర్ డీఈ.. అటెండర్ ఈఈ
- ఆ హోదాల్లోనే బుకింగ్.. అప్రూవల్స్
- సాక్షి కథనానికి స్పందించిన 'అనంత', శ్రీసత్యసాయి కలెక్టర్లు
- ఉద్యోగం నుంచి కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు
- విచారణ చేపట్టాలని ఆదేశం

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని 'సిమెంట్ దొంగల' లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సాగించిన ఈ దందాలో ఆసక్తికరమైన విషయాలు బయటపడుతున్నాయి. సిమెంట్ దొంగల వ్యవహారంపై శనివారం 'సాక్షి'లో 'సమగ్ర'లో సిమెంటు దొంగలు శీర్షికన ప్రచురితమైన కథనం ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష అధికారులు, ఉద్యోగుల్లో దుమారం రేపింది. దాదాపు 35 లోడ్ల దాకా సిమెంట్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని అనుకుంటున్నా...ఇది రెట్టింపు సంఖ్యలో ఉంటుందని సమగ్ర శిక్ష ఉద్యోగులే చెబుతున్నారు. అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్పందించి దీనిపై విచారణకు ఆదేశించారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్ పాత్ర ఉన్నట్లు తేలడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. మరో ఉద్యోగి కూడా ఇందులో కీలకపాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సమగ్ర శిక్ష ఏపీసీ, డీఈఓ సాయిరామ్‌ను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో డీఈఓ విచారణ చేయిస్తున్నారు.



అది నాబార్డ్ స్కూళ్లు, కేజీబీవీ కాలేజీల సిమెంటు

'మనబడి నాడు-నేడు' పనులకు కేటాయించిన సిమెంట్‌ను మాయం చేసినట్లు తొలుత అనుమానించినా... తర్వాత అది నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనులకు కేటాయించిన సిమెంటుగా గుర్తించారు. సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 57 నాబార్డు స్కూళ్లు, 17 కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో వివిధ నిర్మాణ పనులు టెండర్ల ద్వారా జరుగుతున్నాయి. ఈ పనులకు అవసరమైన సిమెంటు కావాలంటే సంబంధిత కాంట్రాక్టర్ డీడీ చెల్లించి డీఈకి అందజేయాలి. డీఈ తన లాగిన్‌లో ఇండెంట్ పెడతారు. దాన్ని ఈఈ ఆమోదం తెలిపి కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ ఆమోదముద్ర వేసిన తర్వాత నేరుగా వైఎస్సార్ నిర్మాణ్ పోర్టల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి కంపెనీలకు వెళ్లి సిమెంట్ లోడు పంపే ముందు బుక్ చేసిన డీడీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ నమోదు చేసిన తర్వాత కంపెనీ నుంచి సిమెంట్ పంపుతారు.

డీఈగా కంప్యూటర్ ఆపరేటర్... ఈఈగా అటెండర్

ఉమ్మడి జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాగా విడిపోయిన తర్వాత ఆ జిల్లా డీఈ, ఈఈ పేర్ల మీద కొత్త లాగిన్లు వచ్చాయి. ఆ రెండింటినీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమవద్దే ఉంచుకుని డీఈ, ఈఈ పేర్లతో వారే లాగిన్ అయ్యారు. డీఈగా కంప్యూటర్ ఆపరేటర్ ఫోన్ నంబరు, ఈఈగా అటెండర్ ఫోన్ నంబరు ఫీడ్ చేశారు. డీఈగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సిమెంట్ బుక్ చేస్తే... ఈఈగా ఉన్న అటెండర్ అప్రూవల్ చేస్తాడు. తన లాగిన్‌కు వచ్చిన వెంటనే అత్యవసర పనులు కావడంతో కలెక్టర్ అప్రూవల్ చేసేస్తారు. కొన్ని సందర్భాల్లో శ్రీసత్యసాయి జిల్లాలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు వీరి ద్వారానే సిమెంట్ బుక్ చేయించుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు కొత్త లాగిన్లు రాలేదంటూ వారిని బుకాయిస్తూ... మీ అవసరానికి అనంతపురం డీఈ, ఈఈ పేర్ల మీద బుక్ చేస్తున్నామంటూ ఆ ఇద్దరు ఉద్యోగులు చెప్పినట్లు తెలిసింది.

ముగ్గురు సైట్ ఇంజినీర్ల సహకారం?..

ఈఈ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగుల అక్రమాలకు శ్రీసత్యసాయి జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు సైట్ ఇంజినీర్లు కూడా సహకరించారు. ధర్మవరం నియోజకవర్గం, రాప్తాడు నియోజకవర్గంలో పని చేస్తున్న వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదో పెద్ద స్కామ్..

సమగ్ర శిక్షలో వెలుగు చేసిన ఈ సిమెంట్ పక్కదారి వ్యవహారం పెద్ద స్కామ్‌లా ఉందని పలువురు చెబుతున్నారు. అదే డిపార్ట్‌మెంట్ వారితో కాకుండా బయట డిపార్ట్‌మెంట్ వారితో విచారణ చేయిస్తే అసలైన సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది వెలుగుచూసే అవకాశం ఉంది. నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి స్వాహా చేసిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేస్తేనే ఉద్యోగుల్లో భయం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

దూరప్రాంత ప్రయాణికులకు పదిశాతం రాయితీ

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారికి టికెట్ ధరలో రాయితీ ఇస్తున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, నెల్లూరు, బెంగుళూరు లాంటి దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ముందుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్ ధరపై రాను పది శాతం, పోను పది శాతం రాయితీ ఉంటుంది. గతంలో కేవలం తిరిగి వచ్చేటప్పుడు మాత్రమే రాయితీ ఉండేది.

సేవాగఢ్‌లో సినిమా షూటింగ్



నృత్య సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ ఆవరణలో శనివారం 'రియల్ లవ్' అనే హిందీ సినిమా షూటింగ్ జరిగింది. దర్శకుడు అంబానీ పవార్, హీరో అంబాస్ దాస్ చౌహాన్‌పై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. సినిమా మొదట హిందీ భాషలో విడుదల చేసి అనంతరం తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. షూటింగ్‌లో భాగంగా సేవాలాల్ మహారాజ్‌పై హీరోతో ఓ పాటను చిత్రీకరించారు. సినిమా క్లైమాక్స్ సన్నివేశాలను ఆది, సోమవారాల్లో చిత్రీకరించనున్నారు. కార్యక్రమంలో సేవాలాల్ మహారాజ్ ఆలయ అర్చకుడు మారుతీప్రసాద్, ట్రస్టు సభ్యులు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినిపై లైంగిక దాడి

ఉరవకొండ: గురుకుల పాఠశాల విద్యార్థినిపై అటెండర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఉరవకొండలోని ఓ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అటెండర్ కన్ను పడింది. వాచ్‌మెన్ గది వద్దకు ఆ విద్యార్థిని తీసుకెళ్లి కొంత కాలంగా లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. ఈ నెల 12 నుంచి పాఠశాల పునఃప్రారంభమైనా కుమార్తె పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లి ఆరా తీయగా అనారోగ్యంతో ఉన్నట్లు తెలిపింది. ఆస్పత్రికి తీసుకెళ్లి చూపిస్తే లైంగికదాడికి గురైనట్లు వైద్యురాలు ప్రాథమికంగా నిర్ధారించారు. అప్పుడు తనపై జరిగిన లైంగిక దాడి గురించి బాలిక తన తల్లికి చెప్పింది. అనంతరం తల్లితో కలిసి స్టేషన్‌కు వెళ్లి సదరు అటెండర్ గత ఏడాదే మరో గురుకుల పాఠశాలకు బదిలీ అయినా, రోజూ రాత్రి వేళ ఉరవకొండలోని గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని సెక్యూరిటీ గార్డు సహకారంతో తనను బెదిరించి లైంగిక దాడికి పాల్పడేవాడని బాధితురాలు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కదిలిన జగన్నాథ రథ చక్రాలు





బంగారు చీపురుతో శుభ్రం చేస్తూ రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రమణప్రభుపాద, కలెక్టర్ గౌతమి (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు - అశేష జనవాహిని మధ్య సాగుతున్న రథయాత్ర

- ఇస్కాన్ ఆధ్వర్యంలో అనంత వేదికగా సాగిన రథయాత్ర
- మార్మోగిన కృష్ణ నామస్మరణ
- కన్నులవిందుగా సాగిన కళావిన్యాసాలు

అనంతపురం కల్చరల్: పురుషోత్తముడు జనం మధ్యకు విచ్చేసి దర్శనమిచ్చారు. బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, అరుదైన కళారూపాలతో ఘనంగా ఊరేగించారు. అడుగడుగునా భక్తులు జేజేలు పలుకుతుండగా ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర శనివారం అనంతపురంలో అట్టహాసంగా సాగింది.

వినాయక చౌక్ నుంచి ప్రారంభం..

పవిత్ర నదీజలాలతో సంప్రోక్షణ అనంతరం సప్తగిరి సర్కిల్‌లోని వినాయక చౌక్ వద్ద రథయాత్రను కలెక్టర్ గౌతమి ప్రారంభించారు. బంగారు చీపురుతో రథం ఎదుట రహదారిని శుభ్రం (ఛెర్రా పహ్రా) చేయగా, విశిష్ట అతిథిగా విచ్చేసిన ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రమణప్రభుపాద జెండా ఊపి ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల గుండా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇస్కాన్ గోశాలకు రథయాత్ర చేరుకుంది.

ఆకట్టుకున్న కళారూపాలు..

వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఇస్కాన్ ప్రతినిధులు చేసిన హరే రామ హరే కృష్ణ నామస్మరణతో అనంత వీధులు మార్మోగాయి. చెక్క భజనలు, బయలు నాటకం, కోలాటం, కీలుగుర్రాలు, ఖడ్గ విన్యాసాలు, పూణే నుంచి వచ్చిన షేర్ డ్రమ్స్ కళాకారుల విన్యాసాలు, శివ శబ్ధాలు, ఉరుములు అనంత ముంగిట సందడి చేశాయి. నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ శిష్య బృందం నృత్య రూపకాలతో ఆకట్టుకుంది. వేదమంత్రాలు, మేళతాళాలతో, భాజా భజంత్రీల వాయిద్యాల హోరు నడుమ జగన్నాథ రథయాత్ర అత్యంత శోభాయమానంగా సాగింది.

భక్తిభావం పెంచడమే లక్ష్యం..

రథయాత్ర ప్రారంభానికి ముందు జరిగిన సమావేశంలో జిల్లా ఇస్కాన్ మందిర ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన కలెక్టర్ గౌతమి, ఏపీ ఎండోమెంటు సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, అహూడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రమణ ప్రభుపాద, సత్యగోపీనాథ్ ప్రభు, టీటీడీ ధార్మిక మండలి జిల్లా అధ్యక్షుడు శ్రీపాద వేణు తదితరులు మాట్లాడారు. అనంత ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇస్కాన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రపంచ శాంతిని నెలకొల్పేదిశగా సాగుతున్న రథయాత్రలో కులమతాలకతీతంగా అందరూ పాల్గొనడం అభినందనీయమన్నారు.









పాండురంగడిపై కీర్తనలు ఆలపిస్తున్న పామిడికి చెందిన వార్కరీలు, కర్ణాటకకు చెందిన కళాకారుల విన్యాసం, కోలాటంతో ఆకట్టుకున్న ఆర్య వైశ్య మహిళా సంఘం సభ్యులు, ఉరుము కళాకారుల విన్యాసం

ఎమ్మెల్యే స్టిక్కర్ నకిలీది

- ఐదుగురూ అనంతపురం వాసులే
- గంజాయి మత్తులోనే వాహనాన్ని వేగంగా నడిపారు
- టోల్‌చార్జ్ మినహాయింపు కోసమే నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్



వివరాలు వెల్లడిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: 'టోల్ చార్జ్‌ను మినహాయింపు పొందడం, పోలీసులు, రవాణా శాఖ అధికారులు నిలపకుండా ఉండేందుకే కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించారు. వాస్తవానికి అది నకిలీది. గంజాయి మత్తులో ఉన్న యువకులు కారు వేగంగా నడిపి ఆటోను ఢీ కొట్టారు. ఐదుగురు యువకులదీ అనంతపురం నగరమే' అని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. గంజాయి మత్తుతో శుక్రవారం ముదిగుబ్బ వద్ద హల్‌చల్ చేసిన యువకుల వివరాలను ఎస్పీ శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... ముదిగుబ్బలోని కాకతీయ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, కదిరి వైపు నుంచి వస్తున్న ఇన్నోవా (ఏపీ09 సీహెచ్ 2373) వాహనం కాస్త దూరంలోనే ఆగిపోయింది. పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి, సిబ్బంది కారువద్దకు చేరుకుని అందులోని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని అనంతపురానికి చెందిన యలమకురి నాగ భాస్కర్, బిన్న ఫరీద్ అలియాస్ షేక్ ఫరీద్, దాసరి కార్తిక్, మెట్ల దీపక్, గరిటకాళ్ల కార్తిక్‌గా గుర్తించారు. వీరంతా అన్నమయ్య జిల్లా మొలకల చెరువుకు చెందిన జావిద్ దగ్గర రూ.600 చెల్లించి ఒక్కొక్కరు 20 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి, సేవించారు. అనంతరం అనంతపురం వైపు వెళుతూ కాళసముద్రం సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై దాడి చేసి రూ. 3 వేలు ఫోన్ పే ద్వారా బదిలీ చేయించుకున్నారు. మధ్యాహ్నం 2:00 గంటలకు ముదిగుబ్బలో ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ గాయపడడానికి కారణమయ్యాడ్డాడు. అనంతరం పోలీసులకు పట్టుబడ్డారని ఎస్పీ వివరించారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలకు తక్షణ పరిష్కారం

- ప్రభుత్వ విప్ కాపు, ఎంపీ రంగయ్య



సమావేశంలో పాల్గొన్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, పైలా నరసింహయ్య, గిరిజమ్మ

బొమ్మనహాళ్: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి శనివారం బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా 90 శాతం మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. అర్హత ఉండి చిన్న చిన్న సాంకేతిక లోపాల కారణంగా పథకాలను పొందలేకపోతున్న వారు, వివిధ కారణాలతో సరైన సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, వారికి పథకాలను చేరువ చేయడంతో పాటు సత్వరమే అవసరమైన సర్టిఫికెట్‌లను అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. నెల రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాలలో పర్యటించి గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించి పథకాలను చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు పసలేని అసత్య ప్రచారాలను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుని సానుభూతి కోసం కొడుకు లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నారని విమర్శించారు. ఈ యాత్ర కూడా సక్సెస్ కాకపోవడంతో వారాహి పేరుతో పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపారన్నారు. సంపద సృష్టి కర్తగా చంద్రబాబును అభివర్ణిస్తున్న టీడీపీ నాయకులు.. ఆయన పాలన ముగిసే నాటికి రాష్ట్ర అప్పు రూ.3.80 లక్షల కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల జీవితాలను తాకట్టు పెట్టి, ఓటుకు రూ.కోట్లు కేసులో రాత్రికి రాత్రే హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చిన చంద్రబాబు నీచబుద్ధి అందరికీ తెలిసిందేనన్నారు. స్థిరత్వం లేకుండా పూటకో మాట మారుస్తున్న పవన్ కళ్యాణ్‌ను ప్రజలెవ్వరూ విశ్వసించడం లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, జెడ్పీటీసీ సభ్యురాలు నీలవేణి, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, స్థానిక నాయకులు చంద్రశేఖరరెడ్డి, ప్రసాదరెడ్డి, కోటేశ్వర రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను నిబద్ధతతో చేపట్టాలి

- కలెక్టర్ గౌతమి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిబద్ధతతో చేపట్టాలని సచివాలయ సిబ్బందికి కలెక్టర్ గౌతమి సూచించారు. కార్యక్రమ పురోగతిపై నిఘా నివేదిక ద్వారా సమాచారాన్ని సేకరించడంతో పాటు ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ ద్వారా లబ్ధిదారులకు ఫోన్ చేసి ఆరా తీస్తామన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం చేసినట్లు తెలిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. శనివారం అనంతపురంలోని రహమత్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డితో కలసి ఆమె పర్యటించారు. జగనన్న సురక్ష గృహ సందర్శన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ నెలాఖరు వరకు ప్రతి ఇంటిలోని సభ్యుల సమాచారాన్ని సేకరించి, పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఎక్కడెక్కడ క్యాంపులు నిర్వహిస్తారో అక్కడ ఏఏ సేవలు ఉచితంగా అందిస్తారో తదితర వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వాట్సాప్ సమాచారంతో పాటు ఎస్ఎంఎస్‌లు, వాయిస్ రికార్డింగ్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమ సమాచారాన్ని చేరవేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ హసీనా, నాయకులు సుకేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, రహమత్‌నగర్‌లో కలెక్టర్ గౌతమి చేపట్టిన కార్యక్రమానికి, 4వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమానికి మేయర్ వసీంకు కనీస సమాచారం లేదు. దీంతో ఆయన సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే విషయమై కమిషనర్ రమణారెడ్డిని ఆరా తీయగా ఆకస్మిక తనిఖీలో భాగంగా కలెక్టర్ కార్యక్రమం జరిగిందని వివరించారు.

సీఏఎస్ పదోన్నతులకు ఆమోదం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పలువురికి పదోన్నతులు కల్పిస్తూ పాలకమండలి ఆమోదం తెలిపింది. శనివారం జరిగిన జేఎన్‌టీయూ(ఏ) పాలకమండలి సమావేశానికి వీసీ ఆచార్య జింకా రంగజనార్దన అధ్యక్షత వహించారు. వర్చువల్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్యామలరావు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఏళ్ల తరబడి విధులకు హాజరుకాకుండా వ్యవహరిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు మెమోలు జారీ చేసి, సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. కాగా, సీఏఎస్ పదోన్నతులు కల్పించే అంశంలో రెండు రోజులు క్రితం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియకు ప్రొఫెసర్లుగా డాక్టర్ విష్ణువర్ధన్(ఈసీఈ) దిలీప్‌కుమార్ (కెమికల్), మాధవి, శివకుమార్(కంప్యూటర్ సైన్సెస్), చంద్రమోహన్ రెడ్డి(ఈసీఈ), శేషమహేశ్వరమ్మ (కెమిస్ట్రీ) అసోసియేట్ ప్రొఫెసర్లుగా జితేంద్రగౌడ్ (ఎలక్ట్రికల్), కళ్యాణిరాధ (మెకానికల్), శైలాకుమారి(మేథమేటిక్స్), మంజుల (ఇంగ్లిష్), జెరీనా (ఫిజిక్స్), సరిత (కెమిస్ట్రీ) సాంబయ్య (ఇంగ్లిష్), అరుణ్‌మస్తానీ(ఈసీఈ) హాజరయ్యారు. వీరందరి పదోన్నతులకు పాలక మండలి ఆమోదం తెలిపినట్లు తెలిసింది.

ఉద్యాన పంటల సాగుపై రేపు సదస్సు

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగుపై బుక్కరాయసముద్రం పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సోమవారం సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు రెడ్డిపల్లి కేవీకే కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు ప్రారంభం

రాప్తాడు రూరల్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అనంతపురంలోని మహిళా అభ్యసన, సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ ఎస్.లక్ష్మీరంగయ్య శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, నర్సింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులు. పూర్తి వివరాలకు 08554-245908, 94901 21294లో సంప్రదించవచ్చు.

'గేట్స్'కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ ఏపీ టెక్నికల్ బోర్డు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ఏడాది ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలిసెట్–2023 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గేట్స్ యాజమాన్యం సూచించింది.

చైన్ స్నాచర్ల హల్‌చల్



అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో బైక్‌పై వెళుతున్న చైన్‌స్నాచర్లు (సీసీ ఫుటేజీ ఆధారం)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్నూలు నుంచి చైన్ స్నాచర్ల ముఠా అనంతకు చేరుకుంది. శనివారం ఉదయం కర్నూలులో ఏకంగా అదనపు ఎస్పీ భార్య మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించిన దుండగులు పోలీసులు అప్రమత్తమయ్యే లోపు అక్కడి త్రీ టౌన్ పరిధిలో ఒకటి, నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో చైన్ స్నాచింగ్ పాల్పడి నేరుగా అనంతకు చేరుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలులో ఏకంగా మూడు స్నాచింగ్‌లకు పాల్పడిన ముఠా సభ్యులు మధ్యాహ్నం 12.15 గంటలకు అనంతపురానికి చేరుకున్నారు. హౌసింగ్ బోర్డులో చక్కర్లు కొడుతూ ఓ స్కూల్‌లో పిల్లలను వదిలి ఇంటికి వెళుతున్న గృహిణి కళ్యాణి మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. సీసీ ఫుటేజీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు కర్నూలులో స్నాచింగ్ పాల్పడిన వారే అనంతపురంలోనూ చైన్ స్నాచింగ్ చేసినట్లు గుర్తించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్... బంగారు గొలుసులు లాగే వ్యక్తి మంకీ క్యాప్ ధరించి, మాస్క్‌తో ముఖాన్ని కవర్ చేసినట్లుగా సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమై ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'ఐఎఫ్‌పీ' ఏర్పాటుకు కరెంటు సదుపాయం ఉండాలి

రాప్తాడు రూరల్: జిల్లాలో 'మనబడి నాడు–నేడు' పనులు పూర్తయిన పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్ల (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసే సమయానికి తరగతి గదుల్లో కచ్చితంగా విద్యుత్ సదుపాయం ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. జిల్లాలోని 534 పాఠశాలలకు 1,595 ఐఎఫ్‌పీలు మంజూరయ్యాయన్నారు. 46 పాఠశాలల్లోని 369 తరగతి గదుల్లో బిగించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. మొదటగా స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో మంగళ వాయిద్యాల నడుమ, పండితుల మంత్రాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం సర్ప సూక్త పాలాభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రాప్తాడు: దిశ యాప్‌తో మహిళలు పూర్తి స్థాయి రక్షణ పొందొచ్చని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళ సంరక్షణ కార్యదర్శులతో దిశ, సైబర్ నేరాలు, డయల్ 100, సోషల్ మీడియాపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని మహిళ సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్ మహిళలకు రక్షగా ఉంటుందన్నారు. అనంతరం సైబర్ నేరాలు, డయల్ 100, సోషల్ మీడియాపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పూల ఆదిశేఖర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో స్టాటిస్టిక్స్ విభాగంలో పరిశోధన చేసిన పూల ఆదిశేఖర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ పాలగిరి మహమ్మద్ అక్తర్ పర్యవేక్షణలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ సీపీ ఎస్‌పీ కుసుం స్కీమ్స్ బేస్డ్ ఆన్ నాథ రాజ హగిగ్ అండ్ జనరలైజ్డ్ వియాబుల్ జాంపిడ్జ్ డిస్ట్రిబ్యూషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

బాలిక అదృశ్యం

రాప్తాడురూరల్: చింత ఆకు కోసం వెళ్తున్నానని చెప్పిన ఓ బాలిక అదృశ్యమైన ఘటన అనంతపురం రూరల్ మండలం ఆలమూరులో శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. ఆలమూరుకు చెందిన సుబ్బరాయుడు కూతురు రెడ్డిజ్యోతి ఇటీవల పదో తరగతి పరీక్షలు ఫెయిల్ అయ్యి ఇంటి వద్దనే ఉంటోంది. రెండు రోజుల కిందట పొరుగింటి అమ్మాయితో కలిసి చింత ఆకు తెచ్చేందుకు వెళ్తున్నానంటూ ఇంట్లో నాన్నమ్మకు చెప్పి వెళ్లింది. సాయంత్రం ఇంట్లో కూతురు కనిపించక పోవడంతో నానమ్మను అడిగారు. గ్రామంలోనూ, చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లేకపోవడంతో బాలిక తండ్రి సుబ్బరాయుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశా డు.

జేఎన్‌టీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 282 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. మొత్తం 360 మంది విద్యార్థులు బీటెక్ చదువుతుండగా, 282 మందికి ఉద్యోగాలు దక్కడం గమనార్హం. టీసీఎస్–118, కాగ్నిజెంట్ –59, ఇన్ఫోసిస్ –21, ఫ్యాక్ట్‌సెట్ సిస్టమ్స్ ఆఫ్ ఇండియా –9, డెక్కన్‌ఫైన్ కెమికల్స్ –7, మెవాక్ టెక్నాలజీస్ – 14, ఆలస్టోమ్ గ్రూప్స్ –4, మేధా సర్వో డ్రైవ్ 6, హెల్త్‌కేర్ నా– 5, ఐబీఎం కార్పొరేషన్ 6, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ –15, ఇండో– ఎంఐఎం– 10, ఏఈఎస్‌ఎల్ –5, ఏఈరియా అసోసియేట్ –2, కియా ఇండియా –1 చొప్పున ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులను వీసీ జింకా రంగజనార్ధన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్లేస్‌మెంట్స్ ప్రొఫెసర్ వి. సుమలత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జే శ్రీనివాసులు అభినందించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: అర్హత ఉన్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' పేరుతో చేపట్టిన మరో బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాల్గో సచివాలయం వద్ద 3,4వ చివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, జేసీఎస్, సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సమాచారం ప్రతి ఇంటా 5 నుంచి 10 నిమిషాలు కేటాయించి, కుటుంబ సభ్యులందరికీ కార్యక్రమంపై తెలియజేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు సమస్యల వివరాలను నమోదు చేసుకొని జూలై 1 నుంచి నిర్వహించనున్న క్యాంపుల్లో వాటికి పరిష్కారం చూపాలన్నారు.

జల్లెడ పడుతున్న ప్రభుత్వం:
గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలుంటేనే పథకాలు, ప్రభుత్వ సేవలందేవని ఎమ్మెల్యే అన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. తమ ప్రభుత్వం జల్లెడ పట్టి మరీ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, ఎంఎల్‌సీ డాక్టర్ దామోదర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సోమశేఖర్ రెడ్డి, లక్ష్మన్న, కార్పొరేటర్లు అంకే కుమారమ్మ, బోయ సుమతి, నాగమణి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు అందజేత
నగరంలోని సోమనాథ్‌నగర్‌కు చెందిన పర్వీన్‌కు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షలు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం అందజేశారు. సోమనాథ్‌నగర్‌కు షేక్ వలీబాషా గత నెల 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ దుర్గాదేవి, కన్వీనర్ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు...
అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరంలోని 18వ డివిజన్‌లోని 25, 26వ సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని మేయర్ పరిశీలించారు. పారదర్శకంగా ప్రతి ఇంటా సర్వే చేయాలని సచివాలయ సిబ్బందిని మేయర్ ఆదేశించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన : నగరంలోని గుల్జార్‌పేట లిటిల్ ఫ్లవర్ స్కూల్ ముందు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. నాయకుల దాదు, సుభేష్, తదితరులు ఉన్నారు.



జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం



బి.యాలేరులో ఇంటింటా సర్వే చేస్తున్న ఎంపీపీ , అధికారులు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



రాప్తాడులో ఇంటింటా సర్వే చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నగరపాలక సంస్థలో విలేకరులతో మాట్లాడారు. కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు, మార్పులు – చేర్పులు, ఫ్యామిలీ మెంబర్స్ పత్రం, ఆధార్ అప్డేట్, కుల గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డు, విభజన, హౌస్ హోల్డ్స్ విభజన మొత్తం 11 రకాల సేవలను ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 74 సచివాలయాలను 12 క్లస్టర్లుగా విభజించామని, జూలై 1 నుంచి నాలుగువారాల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు
రాప్తాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడానికి శనివారం ఆమె రాప్తాడులో ఇంటింటా సర్వే నిర్వహించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ నెల రోజుల పాటు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం రాప్తాడులో వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తిరిగి పథకాలపై తెలియజేద్దాం
ఆత్మకూరు: ప్రతి ఇంటా సమస్యలు తెలుసుకోవడంతోపాటు పథకాలపై తెలియజేద్దామని తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బి. యాలేరులో ఇంటింటా తిరిగి సర్వే చేశారు. మొదట గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లకు , సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుకమ్మ, ఈవోఆర్డీ దామోదర్ రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీ రెడ్డెమ్మ, నాయకులు ఈశ్వరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహేష్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నాం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా మూడు విడతల్లో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో రూపురేఖలు మార్చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం 48వ డివిజన్‌లోని ఇందిరాగాంధీ నగర ఉన్నత పాఠశాలలో రూ.48 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

గడప గడపకూ పనులు పూర్తి చేస్తాం..
నియోజకవర్గంలోని 85 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.17.50 కోట్లు, అనంతపురం నగరానికి సీఎం ప్రత్యేకంగా కేటాయించిన రూ.25 కోట్ల అభివృద్ధి పనులను మరో నాలుగైదు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, ఇస్సాక్, కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, రాజేశ్వరి, నాయకులు రాధాకృష్ణ, లింగాల శివశంకర్ రెడ్డి, బండారు మహేశ్వర్ రెడ్డి, జయచంద్రనాయుడు, సురేష్, పాల్గొన్నారు.

బకాయి చెల్లించిన తర్వాతే తప్పించండి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీకాంత్ తమకు చెల్లించాల్సిన బకాయిలు జమ చేసిన అనంతరం విధుల నుంచి తప్పించాలని కోరడం వివాదస్పదమైంది. ఈ మేరకు జువాలజీ విభాగాధిపతి డాక్టర్ బి. రవి ప్రసాదరావుకు శనివారం వినతి పత్రం అందించారు. 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. పది నెలల పాటు లాస్ ఆఫ్ పేకు దరఖాస్తు చేశారు. సెలవు మంజూరు చేయడం సాధ్యం కాదని ఉన్నతాధికారులు చెప్పడంతో తమకు బకాయిలు చెల్లించిన అనంతరం తనను విధుల నుంచి తప్పించాలని నిరసన తెలిపారు. దీంతో సంబంధిత విభాగాధిపతి ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని పంపారు. గత కొన్ని రోజులుగా లాస్‌ఆఫ్ పే కింద సెలవులు ఇవ్వాలని కోరుతున్నా అధికారులు స్పందించలేదు. దీంతో ఆయన ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేయడం చర్చనీయాంశమైంది.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం క్రైం: ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్య వేదిక నాయకులు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయిని కోరారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందించారు. ఐక్యవేదిక నాయకులు అశ్వర్థ, డీకే రామంలింగం, పురుషోత్తం, గోపాల్, శశియాదవ్ పాల్గొన్నారు.



వాల్మీకి రిజర్వేషన్ పోరాటానికి మద్దతివ్వండి



వాల్మీకి సంజయకుమార స్వామితో ఎంపీ తలారి రంగయ్య

పావగడ: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పోరాటానికి మద్దతివ్వాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కోరారు. స్థానిక నిడుగల్ వాల్మీకి పీఠాధిపతి వాల్మీకి సంజయ కుమార స్వామి దుర్గానికి ఆయన శనివారం విచ్చేశారు. స్వామీజీ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ ఆంధ్రలో వెనుకబడిన బోయ, వాల్మీకి సామాజిక వర్గాలను ఎస్టీలో చేర్చి రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఇటీవల సీఎం జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించారన్నారు. తమ పోరాటానికి కర్ణాటకకు చెందిన వాల్మీకి స్వామీజీల మద్దతు కోసం నిడుగల్‌కు వచ్చానన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ప్రముఖులు రత్నగిరి సంస్థాన దొర రాజ రంగప్ప రాజు, పాళేగార్ లోకేశ్, మంజునాథ్, కదిరే హళ్లి రాజప్ప, తిమ్మయ్య, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీకేపల్లి- ఇటుకలపల్లి మధ్య తుదిపోరు

- శ్రీ సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్

అనంతపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్‌టోర్నీ తుది అంకానికి చేరుకుంది. ఆదివారం మధ్యాహ్నం గ్రాండ్ ఫైనల్ జరగనుంది. చెన్నేకొత్తపల్లి – ఇటుకలపల్లి జట్ల మధ్య జరిగే తుది పోరుకు ఆర్డీటీ స్టేడియం వేదిక కానుంది. మధ్యాహ్నం 1 గంటకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాల్గొన్న 190 జట్లకు క్రికెట్ కిట్లు పంపిణీ చేయనున్నారు. విజేత జట్టుకు రూ.లక్షా 20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు. మే 23 నుంచి ప్రారంభమైన ఈ టోర్నీ ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టోర్నీ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు వచ్చే వారందరికీ భోజన సదుపాయం కల్పించనున్నారు.

సంక్షిప్త సమాచారం

జర్నలిస్ట్ కాలనీలో ఫ్లడ్ లైట్లు ప్రారంభం



ఫ్లడ్‌లైట్లను ప్రారంభిస్తున్న మచ్చారామలింగారెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలోని క్రికెట్ అకాడమీకి ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీలో క్రికెటర్లు రాత్రిపూట ఆడుకోవడానికి, క్రికెట్ నేర్చుకునేందుకు సౌకర్యంగా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అధికారులతో మాట్లాడి కాలనీలో వసతుల కల్పనకు చర్యలు తీసుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ వైస్ చైర్మన్ అరవిందరెడ్డి, జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, విజయరాజు, మల్లికార్జున, నరసింహనాయక్, ప్రకాష్ పాల్గొన్నారు.

27న రక్తదాన శిబిరం
అనంతపురం అర్బన్: సీఐటీయూ నేత, కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 27న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో రక్తదాన శిబిరం కర పత్రాలను నాయకులు విడుదల చేశారు. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 27న ఉదయం 10 గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్విహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి
అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ కోశాధికారి జమున, కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి జూలై 10న నిరసన తెలపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, హరిప్రియ పాల్గొన్నారు.

నేడు 'టైం పాస్' పుస్తకావిష్కరణ
అనంతపురం కల్చరల్: మానవత రక్తదాన ఉద్యమ సంస్థ 29వ వార్షికోత్సవం సందర్భంగా టైం పాస్ – 2 పుస్తకావిష్కరణ ఆదివారం జరగనుంది. ఈ మేరకు సంస్థ కో కన్వీనర్ సలీంమాలిక్ ఓ ప్రకటనలో తెలిపారు. మానవతా సంస్థ కన్వీనర్, సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి రచించిన పుస్తకావిష్కణ సభ ఉదయం 10 గంటలకు స్థానిక ఐఎంఏ హాలులో జరుగుతుందన్నారు.

